క్లుప్తంగా

వర్షానికి తడిసిన ధాన్యం



సిరికొండ: మండలంలోని పోతూ్నర్, పెద్ద వాల్గోట్, చిన్నవాల్గోట్, న్యావనంది, రావుట్ల తదితర గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. ఈక్రమంలో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిచింది. వరి కోతల సమయంలో వర్షం కురుస్తుండటంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్హులకు రుణమాఫీ చేయాలి



ధర్పల్లి: అర్హులైన రైతులందరికీ రుణమాఫీని అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ కాని రైతులు కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరిగి అలసి, విసిగిపోయారని ఆయన అన్నారు. రైతు భరోసాపై కూడా ప్రభుత్వానికి ఒక స్పష్టత లేదని పేర్కొన్నారు. నాయకులు బాలయ్య, పద్మ, గంగాధర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును నమోదు చేసుకోవాలి



నిజామాబాద్ రూరల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కును ఉపాధ్యాయులు నమోదు చేసుకోవాలని మాక్లూర్ మండలం విద్యాశాఖ అధికారి సత్యనారాయణ అన్నారు. మాణిక్‌బండార్ పాఠశాలలో సోమవారం ఆయన మాక్లూర్ మండల ఓటరు నమోదు ప్రక్రియను ప్రారంభించారు. నాయకులు సత్యనారాయణ, బట్టు కృష్ణారెడ్డి, రుద్రంగి ప్రవీణ్ కుమార్, టేకుర్ల సాయిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవో 29 రద్దు చేయాలి



నిజామాబాద్ నాగారం: జీవో 29ని రద్దు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈడబ్ల్యూఎస్ అవసరం లేదని, కులగణన వెంటనే పూర్తి చేయాలన్నారు. బీసీలను ఐక్యం చేయాలని కోరారు. పలువురు జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులకు నియామక పత్రాలను అందజేశారు. జిల్లా అధ్యక్షులు కెంపుల నాగరాజు, ప్రతినిధులు పోతనకర్ లక్ష్మీనారాయణ, బొబ్బిలి నర్సయ్య, ఎనుగందుల మురళి, రేవంత్, అమంద్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలి



నిజామాబాద్ రూరల్: ప్రభుత్వం ఇకనైన పేద రచయితలు, కవుల సంక్షేమం కోసం సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని సామాజిక రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌లాల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నగరంలోని హరిచరణ్ మార్వాడి విద్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రజలతో మమేకమై సామాజిక చైతన్యం కోసం కృషి చేస్తున్న రచయితలు, కవులను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. పేద రచయితల రచనలను పుస్తకాల రూపంలో అచ్చు వేసుకోవడానికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. నాయకులు వేముల శంకర్, తదితరులున్నారు.

జాతీయ సదస్సులో జిల్లా వైద్యుడు విశాల్



నిజామాబాద్‌నాగారం: ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ– దక్షిణా ది రాష్ట్రాల మానసిక వైద్యుల వార్షిక మహాసభలు ఇటీవల బెంగుళూర్‌లో నిర్వహించారు. సదస్సులో ఆన్‌లైన్ బెట్టింగ్, గేమ్స్‌పై అవగాహనపై సదస్సు నిర్వహించారు. రాష్ట్ర శాఖ తరఫున జిల్లాకు చెందిన వైద్యుడు విశాల్ ఆకుల హాజరై ప్రసంగించారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కల్పిస్తే ఈ రుగ్మత నుంచి యువతను బయటకు తీసుకురావచ్చన్నారు.

చెరువులను తలపిస్తున్న రోడ్లు

- నగరంలో కురిసిన వర్షానికి జలమయమైన రహదారులు
- ఇబ్బందులు పడ్డ వాహనదారులు



నగరంలోని బస్టాండ్‌కు వెళ్లే రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

నిజామాబాద్ సిటీ: నగరంలోని రహదారులపై వర్షపు నీరు నిలిచి ఉండటంతో చెరువులను తలపిస్తున్నాయి. నగరంలో సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రతీ వర్షాకాలానికి ముందు నగరంలోని పెద్ద డ్రెయినేజీలు, కాలువలను శుభ్రం చేయాల్సి ఉంటుంది. కానీ బల్దియా అధికారులు నిర్లక్ష్యంతో వాటిని పట్టించుకోవడం లేదు. దీంతో నగరంలోని డీ–57, డీ–51 కెనాల్స్‌తో పాటు పెద్ద డ్రెయినేజీలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. నగరంలో వర్షం కురిస్తే వర్షపు నీరు రోడ్లపై నిలుస్తోంది. భారీ వర్షం కురిస్తే హైదరాబాద్‌లోని పరిస్థితే ఏర్పడనుందని పలువురు పేర్కొంటున్నారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఎదురుగా, ఎల్లమ్మగుట్ట వరకు వెళ్లే రోడ్డు, రైల్వే కమాన్ బ్రిడ్జి, పాత ఆర్‌డీవో కార్యాలయం, డీసీసీ బ్యాంక్ ఎదురుగా, రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు వెళ్లే రోడ్డుపై మోకాళ్ల లోతు వరకు నీరు నిలిచిపోయింది. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి రహదారులపై వర్షంపు నీరు నిల్వ ఉండకుండ చర్యలు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.



పాత ఆర్డీవో కార్యాలయం ఎదుట..



డీసీసీబీ కార్యాలయం ఎదుట..

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



గుండారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



యానంపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిచ్‌పల్లి సొసైటీ చైర్మన్ రాంచందర్ గౌడ్



సర్పంచ్‌తండాలో..

డిచ్‌పల్లి/నిజామాబాద్ రూరల్/సిరికొండ: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో సోమవారం స్థానిక సొసైటీల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. నిజామాబాద్ రూరల్ మండలంలోని గుండారం ప్రాథమిక వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేది కేవలం కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెగిగేట్ శేఖర్‌గౌడ్, జిల్లా నాయకులు మునిపల్లిసాయిరెడ్డి, అగ్గు భోజన్న, గుండారం సింగిల్ విండో చైర్మన్ దాసరి శ్రీధర్, ఖానాపూర్ ఒకటవ డివిజన్ కార్పొరేటర్ కొర్వ లలితగంగాధర్, మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు కొర్వరాజేంద్రప్రసాద్, శివలింగం, సీఈవో అనంతలక్ష్మి, ఏవో యాదమ్మీరా ఉన్నారు. అలాగే సిరికొండ మండలం తూంపల్లి సొసైటీ పరిధిలోని తూంపల్లి, గోప్య తాండ, సర్పంచ్‌తండాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ రాములునాయక్, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య ప్రారంభించారు. వైస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ అబ్బాస్, ఏఎంసీ డైరెక్టర్లు సంపత్‌రెడ్డి, చిన్నారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. డిచ్‌పల్లి మండలంలోని యానంపల్లి, సుద్దులం, కొరట్‌పల్లి, లింగసముద్రం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను డిచ్‌పల్లి సొసైటీ చైర్మన్ రాంచందర్ గౌడ్ ప్రారంభించారు. వైస్ చైర్మన్ కుమ్మరి చిన్నగంగారాం, ఏవో సుధా మాధురి, సొసైటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. మిట్టపల్లి, రాంపూర్, మల్లాపూర్, తిర్మన్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను డీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్‌నాయక్ ప్రారంభించారు. అలాగే బర్ధిపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ రామకృష్ణ ప్రారంభించారు.

మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న చైర్మన్ ముప్ప గంగారెడ్డి

సుభాష్‌నగర్: నిజామాబాద్ మార్కెట్‌యార్డు అభివృద్ధికి పాలకవర్గం కృషి చేస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి పేర్కొన్నారు. శ్రద్ధానంద్ గంజ్‌లోని కార్యాలయ సమావేశమందిరంలో సోమవారం నూతన కార్యవర్గం మొదటి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మార్కెట్‌కమిటీ ఆదాయ వ్యయాలు, సమస్యలు, ఇతరత్ర అభివృద్ధి పనుల గురించి సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ అపర్ణ వివరించారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. అనంతరం చైర్మన్ ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్‌యార్డులో పంట విక్రయించే రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర దక్కేవిధంగా పాలకవర్గం పాటు పడుతుందని తెలిపారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తామని, మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మేయర్ నీతూ కిరణ్, వైస్ చైర్మన్ జంగిటి రాంచందర్, డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

రాష్ట్రస్థాయి క్రీడాకారిణులకు అభినందన



డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం గురుకుల బాలికల పాఠశాల/కళాశాల క్రీడాకారిణులను సంస్థ జోనల్ ఆఫీసర్ ఫ్లోరెన్స్ రాణి సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్, సాఫ్ట్‌బాల్, చెస్ పోటీల్లో పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారని వారు తెలిపారు. ఫిజికల్ డైరక్టర్ నీరజారెడ్డి, పీఈటీ జోత్స్న, సూపరిండెంట్ రాజేందర్‌రెడ్డి తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



సిరికొండ: మండలంలోని గడ్కోల్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని ప్రీతి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీకాంత్, పీఆర్టీయూ నాయకుడు లక్ష్మారెడ్డి సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ప్రీతిని ఉపాధ్యాయులు అభినందించారు. పీడీ నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజేతగా నిలిచారు. ఇటీవల జరిగిన పోటీల్లో జిల్లా జట్టు విజయం కోసం విద్యార్థులు గెడం వనజ, గెడం సరిత కృషి చేసి, బంగారు పతకాలు అందుకున్నారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మార్కంటి గంగా మోహన్ తెలిపారు. క్రీడాకారు లను హెచ్‌ఎం, ఎంఈవో శ్రీనివాస్ అభినందించారు.

ఎయిడ్స్‌పై అవగాహన

డిచ్‌పల్లి: మండలంలోని కొరట్‌పల్లి గ్రామంలో సోమవారం వర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంస్థ ప్రతినిధి సుజాత గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

నిధులు మంజూరు చేయాలి

సిరికొండ: మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన మాల సంఘం సభ్యులు ఎమ్మెల్యే భూపతి రెడ్డిని సోమవారం కలిసి, సన్మానించారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వారు ఎమ్మెల్యేకు విన్నవించారు. నాయకులు గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, మోతీరాం, గంగబాపు, మధు, హేమంత్, రాకేష్, రాములు, స్వామి, దావీద్, ప్రశాంత్, రాజన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు షూస్ వితరణ

జక్రాన్‌పల్లి: మండలంలోని లక్ష్మాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం విద్యార్థులకు ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి షూస్, సాక్సులను వితరణ చేశారు. మాజీ సర్పంచ్ కైలాస్, హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ వెంకటేష్, నాయకులు సంతోష్ నాయక్, రంజిత్ నాయక్, రొయ్యల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నిజామాబాద్ సిటీ: నగరంలో సోమవారం నగర సీపీఎం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు పార్టీ నాయకులు సోమవారం తెలిపారు. ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటుచేశారు. కార్యదర్శిగా బెజ్జం సుజాత, కార్యవర్గ సభ్యులుగా నరసయ్య, రాములు, అనిత, అనసూయ, నవీన్, దీపికలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

అయోడిన్ లోపంపై అవగాహన



నిజామాబాద్‌నాగారం: నగరంలోని అర్సపల్లి, మాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం గ్లోబల్ అయోడిన్ లోప అనర్థాల నివారణ దినోత్సవం సందర్భంగా 'అయోడిన్ లోపం– అనర్థాల'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజు మాట్లాడుతూ.. అయోడిన్ లోపాల వల్ల కలిగే శారీరక రుగ్మతలను వివరించారు. వైద్యులు అజ్మతున్నేసా బేగం, గంగా దినేష్, ఘన్పూర్ వెంకటేశ్వర్లు, శశికళ, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి మండలంలో..



ఇందల్వాయి: మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో సోమవారం ప్రపంచ అయోడిన్ లోప రుగ్మత నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులకు అయోడిన్ లోపాల వల్ల కలిగే శారీరక రుగ్మతలపై పీహెచ్‌సీ హెచ్‌ఈవో శంకర్ అవగాహన కల్పించారు. అయోడిన్ పొందేందుకు అయోడైజ్డ్ ఉప్పును వాడాలన్నారు. ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్ అర్బన్: మాక్లూర్ కేజీబీవీలో ఇటీవల ఓ విద్యార్థినిని మంత్రగాళ్ల దగ్గరికి తీసుకెళ్లిన టీచర్ గౌతమిరెడ్డిపై, ఇందుకు అనుమతించిన ఎస్‌వోపై తగిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు.

నుడా చైర్మన్‌ను కలిసిన నాయకులు



నిజామాబాద్ సిటీ: నుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కేశ వేణును సోమవారం పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, సన్మానించారు. నాయకులు దయాకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నగరాభివృద్ధికి రూ.100కోట్లు ఇవ్వాలి

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్
- పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నగరంలో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్, మేయర్ నీతూకిరణ్

సుభాష్‌నగర్: ఇందూరు నగర అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించాలని, రూ.100 కోట్ల ప్రత్యేక నిధులు విడుదల చేయాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. నగరంలోని 22, 23వ డివిజన్లలో సోమవారం సీసీ, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 23వ డివిజన్‌లో స్పెషల్ ఫండ్‌నుంచి రూ.11.5 లక్షలు, జనరల్ ఫండ్ నుంచి రూ.10లక్షలు, పట్టణ ప్రగతి ద్వారా రూ.10లక్షల నిధులతో సీసీ, బీటీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. అలాగే 22వ డివిజన్ మహాలక్ష్మినగర్‌లో రూ.10లక్షల జనరల్ ఫండ్‌తో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఇందూరు నగర అభివృద్ధి, సుందరీకరణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, 15వ ఫైనాన్స్ కమిషన్ బకాయి నిధులు చెల్లించాలని పేర్కొన్నారు. 23, 24వ డివిజన్‌ను కలిపే రోడ్డు నిర్మాణానికి విశ్వశాంతి విద్యాసంస్థల యజమాని రోజారాణి 300 గజాల స్థలాన్ని ఉచితంగా ఇవ్వడంపై ఆమెను అభినందించారు. నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, ప్రభాకర్, ఎర్రగుంట లక్ష్మణ్, హరీష్‌రెడ్డి, కైరంకొండ మురళీ, హరీష్, ధర్మేందర్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బీ

నిజామాబాద్‌నాగారం: మానసికంగా పిల్లలు సరిగ్గా లేనప్పటికీ వారిని నిరుత్సాహపరచకుండా ప్రోత్సహిస్తూ ముందుకు తీసుకెళ్లినప్పుడే వారు ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యమవుతుందనిజిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బీ తెలిపారు. జిల్లా కేంద్రంలోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో సోమవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథులుగా హాజరై, మాట్లాడారు. ప్రతి జీవికి మెదడు చాలా కీలకమని, ప్రతి ఒక్క జీవికి భగవంతుడు ఒకేలా తెలివితేటలు, ఆరోగ్యాన్ని అందిస్తారన్నారు. సొసైటీలో ఉన్న దివ్యాంగ, అంద పిల్లలు చదువుకొని ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాల్లో సైతం నియామకమైన విషయం తెలిసిందేన్నారు. మానసిక వైద్య నిపుణులు రవితేజ, సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరులకు ఘన నివాళి



జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న పోలీసులు



సిరికొండలో..

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు స్థానిక సిబ్బంది ఘన నివాళులు అర్పించారు. ఏఎస్సైలు వెంకట్ కుమార్, సుశీల్ కుమార్, నాయకులు నర్సారెడ్డి, వినోద్, జితేందర్ నాయక్ పాల్గొన్నారు.

సిరికొండ: సిరికొండ పోలీస్ స్టేషన్‌లో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీసు అమరులకు ఎస్సై రామ్, సిబ్బంది నివాళులు అర్పించారు. అనంతరం ఓపెన్ హౌజ్‌లో భాగంగా విద్యార్థులకు పోలీసుల సేవల గురించి వివరించారు.తెలంగాణ చౌరస్తాలో మానవహారం ఏర్పాటు చేసి అమరులకు నివాళిగా మౌనం పాటించారు.విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు.హెడ్ కానిస్టేబుళ్లు మధుకర్, జీవన్, కరుణ, కానిస్టేబుళ్లు రాకేష్, దేవేందర్ పాల్గొన్నారు.

నియామకం

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రానికి చెందిన పిప్పెర లావణ్య బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళ అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఈమేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు కొండవీటి శ్యామ్ ప్రసాద్ ఆమెకు నియామకపత్రం అందజేశారు. సంఘ ప్రతినిధులు రాంగిరి నర్సయ్య, ప్రభాకర్ చారీ, సురేష్ రుక్మాజీ, గంగరాజుల రామ, దేశాయి కల్పన, పూస జయమ్మ, కవిత, వెంకమ్మ, గంగమణి పాల్గొన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	81,200	వెండి (కిలో)	102000
22 క్యారెట్స్	73,250	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	32	50	గాజరుగడ్డ	50	80
బెండకాయ	35	50	పచ్చిమిర్చి	60	90
బీరకాయ	40	70	దోసకాయ	30	50
దొండకాయ	25	50	ఆలుగడ్డ	30	50
బీర్నీసుకాయ	80	120	గోబిగడ్డ	30	50
కాకరకాయ	40	80	గోబిపువ్వు	60	90
వంకాయ	40	60	బీట్‌రూట్	35	60
పాలకూర	50	80	కరివేపాకు	40	70
మెంతికూర	60	80	చామగడ్డ	40	70
కొత్తిమీర	50	80	గోరుచిక్కుడు	50	80
పుదీనా	60	90	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	60	90			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా పెషియన్)

స్క్రీన్-1	విశ్వం (తెలుగు) - 10.20, 1.20, 4.20 10.30, దేవర పార్ట్-1 (తెలుగు)- 7.25
స్క్రీన్-2	కల్లుకంపౌండ్(తెలుగు)-10.40, జనక అయితే గనక -1.30, లవ్‌రెడ్డి -4.30, జిగ్రా(హిందీ)- 10.30
స్క్రీన్-3	వేట్టయన్ - 10.30 4.35 7.40, 10.40, ఖడ్గం(తెలుగు)-1.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	వేట్టయన్(తెలుగు)- 10.10 ది వైల్డ్ రోబోట్ - 1.40, 7.45, 10.15, దేవర పార్ట్-1(తెలుగు)- 4.10
స్క్రీన్-2	ది వైల్డ్ రోబోట్(తెలుగు)-10.30, విశ్వం (తెలుగు) - 1.00 7.15, జనక అయితే గనక -4.15 10.30
స్క్రీన్-3	ఇద్దరు (తెలుగు)-10.00, లవ్‌రెడ్డి (తెలుగు) - 1.00 ,7.30, వేట్టయన్ (తెలుగు) - 4.00, ఖడ్గం (తెలుగు) - 10.30
స్క్రీన్-4	రివైన్డ్(తెలుగు)-10.25, వీక్షణం(తెలుగు) - 1.20, జిగ్రా(హిందీ) -4.00, వేట్టయన్(తెలుగు)-10.40
లలితామహల్	దేవర పార్ట్-1(తెలుగు)
దేవి	జనక అయితే గనక (తెలుగు)
నటరాజ్	విశ్వం (తెలుగు)
విజయ్	వేట్టయన్(తెలుగు)